శేను. నేరంచేసేవా? ఏమంటావ'ని అడిగేరు జడ్జీగారు. అడిగిన దానికే జవాబు చెప్పాలనుకుని 'చిత్తం. వాళ్ళని తిట్టినమాటూ, వాళ్ళపిల్ల రిబ్బను తీసుకున్నమాటూ నిజమే' అన్నాను. ఏమైనా జరిగితే జరిగిందంతా చెప్దామనుకొని ఊరుకున్నాను. మేజిస్ట్రేటుగారు తలొంచుకొని ఏదో రాసుకోవడం మొదలు పెట్టేరు. పదినిమిషాలయ్యేక శిక్ష వేస్తారేమోనని భయం వేసింది. ఏం చెయ్యాలో తెలీలేదు. 'అది కాదు సార్! ఆ రెండు రిబ్బన్లు తీసుకున్నా గాని అందులో ఓటి వాళ్ళది కాదు సార్' అన్నాను.

ఇంతలో ఎవరో కాకిపేంటూ, నల్లకోటూ తొడుక్కున్నాయన – ఎవరో ఎ. పి. పి. గారట– 'ఒకటి వాళ్ళదని ఒప్పుకుంటూవుకదా! అది చాలు' అన్నాడు. నేను అతనికేదో యిస్తున్నట్టు. మేజిస్ట్రేటుగారు వెంటనే తీర్పు చెప్పేశారు. 'నన్ను ఏవో సెక్షన్లక్రింద దోషిగా భావించేరని, కానిప్రథమ నేరంఅవడంవల్ల ఒక సంవత్సరం ప్రొబేషనుమీద వదిలేస్తున్నారని ఆ సంవత్సరం నేను నేరాలు చెయ్యకుండా బుద్ధిగా మంచి నడవడి కలిగి వుండాలని ఆ తీర్పు.'

కథ ముగిసిపోయినట్టే. ఆ సంవత్సరం అయిపోయేక విచ్చలవిడిగా, ఆవారాలా దొంగతనాలూ, ఖూనీలు చేసినా పద్ధతికీ, చట్టానికి వ్యతిరేకం కాదన్నమాట అనుకుంటూ, ఎవరో జామీనుదారుని కుదుర్చుకొని పూచీ కత్తుమీద సంతకం పెట్టేను.' అంటూ కథ ముగించేడు డాక్టరు.

'ఐతే మా డిపార్టుమెంటు చురక నీక్కూడా తగిలిందన్నమాట' అన్నారు జడ్జీగారు నవ్వుతూ.

'లక్ష్మికి చావుతప్పి మీకు కన్ను లొట్టపోయిందండురూ' అన్నాడు తనూ నవ్వుతూ, అంతవరకూ పలుకే బంగారమైన శంకర్రావు.

'ఇప్పటికైనా జనగణమన పాడొచ్చా? లేకపోతే యింకా వుందా కాశీమజిలీ?' అంటూ లేచేడు విశ్వనాథం.

□□□



# మీకు కూడా కథంటే ఇష్టం

నేనొచ్చేస్తున్నా నన్న టెలిగ్రాం చూసుకుని స్టేషనుకి ఒచ్చినట్టున్నారు మా ఆయన...అంతసేపూ చింతతోనూ వంతతోనూ నిండిన మనస్సులో ఆయన కనబడగానే అదంతా మాయమై, ఆయనమీదున్న సానుభూతి యిగిరిపోయి కోపం ఒచ్చేసింది నాకు.

'పండక్కి రాలేదేవఁండీ?' అని అడిగాను, జోరుగా.

'... ... ... ... ...'

'అస లెక్కడున్నారు, పండక్కి?'

'... ... ... ... ...'

'జవాబు చెప్పరేఁవఁండీ?'

'... ... ... ... ...'

'మీ కోసం ఎంతలా ఎదురు చూసేనండీ! ... ...మా వాళ్ళందరూ అడగడఁవేఁ; ఏఁవేఁ, మీ ఆయన రారా, అసలు నీతో ఏం చెప్పేరే అంటూనూ! ఏమిటిలా చేసేరు? ... మరీ మరీ చెప్పేనుకదా; ... అసలు మీరే కదండీ, తప్పకుండా ఒస్తాను– అంటూ చెప్పేరు!'

ఆయన నా ప్రశ్నల్ని టైమ్‌లేనట్టుగా దాటేస్తున్నారు... నడుస్తూనే ఉన్నాం... ...పోర్టర్ని పిలవడం, సామాను వాడినెత్తిన పెట్టడం, టిక్కెట్టు నా దగ్గిర పుచ్చుకోడం, జేబులోంచి ఆయన టిక్కట్టు బైటికి

భమిడిపాటి రామగోపాలం

తీసుకోవడం, రెండూ కలిపి గేటు దగ్గిర ఇచ్చెయ్యడం, రిక్షామాట్లాడ్డం, అందులో సామాను పెట్టించి కూచోడం— నా ధ్యాసే లేదు ... ... నేను అడుగుతూవుండడం, ఆయన నా వేపు ఓ సారి వెర్రిమొహం వేసి చూడ్డం, మళ్ళీ పనిలో పడ్డం— అలా అయిపోయింది.

"ఎందుకండీ రాలేదు? ... ... మాట్లాడరేవఁండీ?— పండక్కి ఎడ్వాన్సూ పెట్టుగుని:— సెలవూ పెట్టుగుని; — హాయిగా అక్కడికొచ్చి సరదాగా వుండక ఇక్కడే కూచుండిపోయారేం?— మా వాళ్ళిల్లు అంత మొహం మొత్తేసిందా? అమాత్రందానికి నన్నెందుకూ, రెండురోజులు ముందుగా వెళ్ళు, అలా అంటూ పంపేశారు?— అసలు మాట్లాడరేం??"

అప్పుడొచ్చింది ఆయనోమాట ... జవాబుకాదు; ప్రశ్న! "చెప్తాను కమలా; ఏమిటి, గొడవ—? ఇంటికెళ్ళే వరకూ ఆగలేవా?"

"నే నాగలేను! చెప్పండి!!"

అన్నాను, గట్టిగా.

రిక్షావాడు ఓసారి వెనక్కితిరిగి చూశాడు. నేను మొహం ముడుచుకొని ఊరుకున్నాను.

● ● ●

రాత్రైంది.

తొమ్మిది దాటింది, వంటా భోజనాలూ ఐ మళ్ళీ తీరిక చేసుకునే సరికి.

"కిళ్ళీలు తెమ్మంటావా?" అన్నారాయన: నేను వంటింట్లో పనిపూర్తి చేసుకుని ఇవతల పడగానే.

"కిళ్ళీలూ ఒద్దు సోడాలూవొద్దు. కాస్తనడుం వాల్చనీండి. చచ్చి చచ్చి ఒచ్చేను ... ..."

"అమాత్రం దానికి ఈ ఒక్క పూటకీవంటూ పెంటూ అంటూ గుండా పిండీ అయిపోకపోతే ఏం? కేరియర్ తెచ్చుకుంటే ఏడింటి కల్లా తినేసి ఈ పాటికి నిద్రపోయే వాళ్ళంగా! ... ... ... పోనీ నన్నేనా సుఖంగా కూర్చో నిచ్చేవా ... ... గసగసాలు తెండి; ధనియాలు తీసుకురఁడంటూ అరడజనుసార్లు బజారుకి పంపేవు! ... ..."

నా కావలింత ఒచ్చింది. లేకపోతే ఏదో అందును నేనూను ... ఆక్షణం అయిపోగానే మళ్ళీపండగ — ఈన రాకపోడం జ్ఞాపకం ఒచ్చేసింది. "ఇంతకీ పండక్కెక్కడున్నారో చెప్పరే కారు!"

"ఇక్కడే వున్నాను ... ... ..." అన్నారాయన చిరునవ్వుతో.

"అబద్ధం ... ... ఇక్కడ లేరట గా. మహాలక్ష్మమ్మగారు చెప్పింది. విశాఖపట్నం వెళతానని బైలుదేరాడు, మీ అయన— అయితే రాలేదూ —? అని ఆశ్చర్య పడ్డదావిడ. తాళంచెవులు ఆవిడకే యిచ్చేర్టగా!"

"రాగానే కష్టసుఖా లావిడితో చెప్పుకున్నా వన్నమాట!" ఎగతాళిగా అన్నారు.

"చాల్లెండి ... ... నేనేం అబద్ధాలు కల్పించి చెప్పలేదు. మీరేమో పదకొండో తారీఖు సాయంత్రం విశాఖపట్నం వెళుతున్నానండోయ్. అని తాళా లిచ్చేరుట; మళ్ళీ పదహారో తారీకు మధ్యాన్నం ఒచ్చి అంతా కులాసాగా ఉన్నారండీ; మా ఆవిడ రేపు ఒస్తోందంటూ తాళాలు తెచ్చుకున్నార్ట ... ... నాకు ముందుగా తెలీక నిజం చెప్పేశాను!"

"పోనీలే — ఏదో అయిపోయింది ... ..."

"ఇక్కడా లేక, విశాఖపట్నమూ రాక, ఎక్కడున్నారండీ, నాలుగు రోజులూ మరి!"

"ఎందుకులెద్దూ!"

"ఎందుకేఁవిటి — చెప్పండి!— ఇంటిదగ్గిర చెప్తానన్నారుగా!"

ఆయన మళ్ళీ మాటాడకుండా కూచున్నారు. ఎంత అడిగినా చెప్పకపోడానికి కారణం ఏమిటో! అంత చెప్పకూడని చోటికి వెళ్ళేరా? అయినా చెప్పేస్తారే! ఇలాదాచటం కొత్తగా ఉందని తెలిసిపోయి బాధగా ఉంది.

"... ... ఎక్కడున్నారో, ఏం చేస్తున్నారో అసలు ఒంట్లో కులాసాగా ఉందో లేదో అని నాప్రాణం ఎంత కటకట్లాడిందో మీకేం తెలును? ... ... ఇద్దరం కలిసే ... వెళదాఁ వఁడీ అంటున్నాకూడా వినిపించుకోక కొంపలు ముంచుకు పోయినట్టు రెండ్రోజులు ముందుగా నన్ను సాగనంపేశారు ... ... ... పైగా వాళ్ళందరూ అడగడం ఒకటే; ఏమే మీ ఆయనొచ్చాడా అంటే, ఒస్తే నీమొగుడు రాట్టే అంటూనూ!"

"కష్టఁవేఁ; పాపం!" అన్నారాయన, చిరునవ్వుతో.

"ఎంత వెటకారంగా వుందండీ మీకు! ... ... ఇంతకీ ఎక్కడున్నారో చెప్పరే?"

"ఎక్కడుంటే నేం; నేను ఆరోగ్యంగా సుఖంగా, కులాసాగా, సంతోషంగా పండగ వెళ్ళించేను ... నీక్కావల్సిం దంతేగా!"

ఏ వూరు వెళ్ళేరు చెప్పండి, పోనీ!"

"నిడదవోలు!"

"మీ సుభద్ర గారింటికా?"

"ఏ సుభద్రా?"

"... ... ఎంతమంది సుభద్రలున్నారు?— మీ— మీ సుభద్రే— సుభద్రార్జునీయంలో సగం దాకా వొచ్చిన ... ... ... అదుగో, నవ్వుతున్నారు! వెళ్ళేరా, అక్కడికి?—

ఛీ ఛీ—ఇలా ఎవరైనా చేస్తారుటండీ?' నాకూ నవ్వు ఆగలేదు; సుభద్రా, ఆయనా, ఆ కథంతా జ్ఞాపకం ఒచ్చి.

'నవ్వకు కమలా … …సుభద్రగారింటికొచ్చాడు. అక్కడికెందుకు వెళతానూ?—అసలు సుభద్ర వాళ్ళ పుట్టింటికి వెళ్ళిందిగా!'

'ఓహో; భోగట్టా చేసేరన్న మాట!'

'అంతే మరీ— ఆ వూరుదాకా వెళ్ళేక—నువ్వు నవ్వితే నేచెప్పను!'

నేను బలవంతాన నవ్వు ఆవుకున్నాను—అయినా ధోరణి ఆలాగే ఒచ్చేస్తోంది. 'చెప్పండి చెప్పండి… అసలు సరిగ్గా నిడదవోలే ఎందుకు వెళ్ళవలిసొచ్చిందిట?'

ఆయన గొంతు సర్దుకున్నారు. 'విశాఖపట్నానికే టిక్కెట్టు కొనుక్కున్నానే… …' అని, తలగడా గోడకి నిలువుగా చేరేసి, సదుపాయంగా అనుకొని కూర్చొని, అనగనగా ధోరణిలో ప్రారంభించేరు. '—అసలేం జరిగిందంటే; బండి రెండుగంటలు లేటు! ఫ్లాట్‌ఫారంమీదే బెంచీమీద కునికిపాట్లు పడుతున్నానన్న మాట…బండొచ్చింది లేవండిసార్, అంటూ పోర్టర్ లేపేడు; బేగ్ రైల్లో పెట్టాడు… …కూచోడానికి జాగా లేక జనం చస్తూవుంటే ఎవరో ఒక అతను దర్జాగా ముసుగుతన్ని నిద్దరోతున్నాడు…ఒళ్ళుమండి, అపళంగా చేతులోవున్న న్యూస్‌పేపర్‌తో వీపు నంత గట్టిగా నాలుగు తగల్నిస్తూ రైలుబండి నీ బాబుగారి సొత్తనుకున్నావా, లే, అని లేపేను; తీరా చూస్తే వాడు మా నర్సింహారావు!'

'నర్సింహారావెవరండీ?' అన్నాను, సంగతి సగంపైగా బోధపడక.

'—కలకటూలో పని చేస్తున్నాడులే, వాడు. ఏడెనిమిదేళ్ళైంది, వాడూ నేనూ కలుసుకొని… హారి నీ తస్సాదియ్యా అంటే హారి నీ దుంపతెగా అని పలకరించుకున్నాం; చకచకా మాట్లాడేసుకున్నాం… … వాడికి కిందటేడే పెళ్ళైందిట. పండక్కి అత్తారింటికి పోతున్నాట్ట … కబుర్లు చెప్పుకుంటూ కూచున్నాం … … ఇంతట్లో రైలు గోదావరి బ్రిడ్జిమీద నడవడం తెలిసి కంగారుగా లేచి నించున్నాను… …ఆ రైలు విశాఖపట్నం వెళ్ళటంలేదు! బెజవాడ పోతోంది!!—పోర్టర్ వెధవ ఇందులో కూచోపెట్టేశాడు!—అని గాభరాపడ్డాను.'

'ఎంత తమాషా అండీ!'

ఆయన నన్ను ఆశ్చర్యపడనివ్వలేదు.

'విను… అప్పుడింకేంచెయ్యడం? —సరే, కొవ్వూర్లో దిగి వెనక్కొద్దాం; అనుకున్నాను—ఆ పళంగా వాడు లంకించుకొని, — ఏడిశావులేవోయ్. ఇప్పుడు నువ్వు విశాఖపట్నం వెళ్ళక





పోతే ఏమీ! అన్నాడు. టిక్కెట్ కూడా కొనుక్కున్నాను; మా ఆవిడా వాళ్ళవాళ్ళూ ఎదురుచూస్తార్రా అని ఎంత చెప్పినా వాడు విన్నాడేకాదు. నిడదవోలు వాళ్ళ అత్తారూరట; వాడికూడా అక్కడికెళ్ళేసి, పండగ మూడు రోజులూ వాడితో వుండి, మళ్ళీ పదహారో తారీక్కి రాజమండ్రి చేరమంటాడు…!సగం సేపు వేళాకోళం అనుకున్నాను… కొవ్వూరు స్టేషన్లో నన్ను దిగకుండా పట్టేసుకున్నాడు. ఆ తరువాత స్టేషన్లో గార్డు దగ్గరకువెళ్ళి నిడదవోలుకి టిక్కెట్ రాయించి పుచ్చేసుకున్నాడు…సరి, ఇంకో గడియలో నిడదవోలు రానే వొచ్చింది!'

'ఊఁ హూఁ!… …అతన్తో నిడదవోల్లో దిగిపోయి అక్కడుండిపోయేరన్నమాట…ఎంతపని చేసేరండీ!—పోనీ ఓ ఉత్తరం ముక్క రాయలేకపోయూరా, ఇలా జరిగిందంటూను! …పండగ మూడురోజులూ, పిలవని

పేరంటానికి వెళ్ళి బట్టలకీ దానికీ దీనికీ మొహమాటపడి—ఎలా ఉండి పోయే రండీ. అంత తెలియని వాళ్ళింటోను!—అతని కర్తారుగాని మీ కెవరు?—' నాకు నవ్వొచ్చింది.

'అబ్బే, లేదు కమలా. అన్నీ బాగా జరిగేయి—వాళ్ళ ఆదరం చెప్పడానికే బాధగా ఉంది నాకు!' అన్నారాయన. పెంకెతనంగా నవ్వుతూ, వోరకంట చూస్తూ.

'బాధెందుకో.'

'నువ్వేమనుకుంటావో నని—!'

'నేనే మనుకుంటానండీ, చిత్రంగా మాట్లాడతారు!'

'నువ్వనుకోడాని క్కారణం ఉందిలే... ...అసలు మా నర్సింహారావు వాళ్ళింటికి వెళ్ళడమే; పెళ్ళయ్యేక మొదటి సంక్రాంతి...బాగాడబ్బున్న వాళ్ళేమో, చాలా ఘనంగా చేద్దామనుకున్నారు. — అల్లుడితో గిల్లగన్నట్టు నాక్కూడా అంతఘనంగానూ చెయ్యవలిసొచ్చింది... నేనెక్కడ మొహమాట పడతానో అని అన్నీ అడక్కుండా ఏర్పాటయిపోయేవి!...'

'బాగా ఆస్తి పరులా.'

'అబ్బో; చాలా. ధాన్యం వ్యాపారం. గోడౌన్లూ, మిల్లులూ, దుకాణాలూ, ఓ పెద్దబట్టలకొట్టూ. ఇదికాక ఆడవాళ్ళు వడ్డీవ్యాపారం చేస్తారు ...తెల్లారితే భోగి అనగా రాత్రి వెళ్ళాంకదూ... ... తెల్లారే సరికి వేణ్ణీళ్ళూ, జెమాజెట్టీల్లాంటి మంగళ్ళూ తయారు. వాళ్ళ ఐశ్వర్యంమాసిపద్ధతి మారిపోతుం దనుకున్నాను కాని అలా జరగలేదు. షాంపూ రుద్దుకొని షవర్ బాత్‌లుచేస్తేమట్టుకు నలుగు పెట్టి తలంటుకున్న నునుపూ శుభ్రం ఒస్తాయా? జన్మలో కుళ్ళంతా ఒదిలేటట్టు అభ్యంగనం చేయించారు... కొత్తబట్టలే వెలాగా, అని నేను చిన్నబుచ్చు కుంటూనే ఉన్నాను; ఇంతట్లోకి పెద్దాయన, ఎనిమిది గజాల ఫినైచాపు పట్టుకొచ్చాడు, (ఇప్పుడు నేకట్టుకున్నపంచె దాల్లోదే చూడు!)... 'అలా వొక్క క్షణం కూర్చోండీ, అబ్బాయి షాపుకు వెళ్ళేడు. చొక్కాలు తెస్తాడు' అని మర్యాదగా చెప్పి; కాఫీ తాగేలోపుని కట్టబెట్టారు. నాకేవై తేనచ్చుతాయో, ఎంత లేసైతే సరిపోతాయో సరిగ్గా అలాటివి, రెండు చొక్కాలు— ఆశ్చర్యపడుతూనే, మా నర్సింహారావుని పిల్చి, ఏమిట్రా ఇదంతానూ, నీ కేమేనా మతుందా లేదా అని చీవాట్లు పెడితే, వాడు పెద్ద నవ్వు నవ్వేసి, ' మీ అత్తారింటికి వెళ్ళి వాళ్ళిస్తే కట్టుకోవుట్రా; అక్కడికి వెళ్ళకుండా చేసినందుకు నీకిమాత్రం చెయ్యకపోతే ఎలాగు —' అన్నాడు—!


'చాలా బలగం వున్నారు కాబోలు... ...'

'ఓ! అతనికి నలుగురు మరదళ్ళూ, ఇద్దరు బావమరుదులున్నా— గొప్ప కాలక్షేపం అనుకో—నాకే ఆశ్చర్యం వేస్తుందిప్పుడు, మూడు రోజులు నిన్ను మరిచిపోయి; నీకు ఉత్తరమైనా రాయకుండా వుండి పోయానంటే —' అని ఆగారు, మా ఆయన.

'అవునెండి— అలాంటి చోటికెళ్తే ఇంక నేనెందుకు జ్ఞాపకం వస్తాను; ఉత్తరాలేనా ఎందుకు రాస్తారు; పాపం!' అన్నాను, చాలా ఆనందిస్తూ న్నాయన్ని సరదాగా సాధించాలన్న కోరిక చంపుకోలేక.

'ఆదుగో — చెప్పకపోతే ఊరుకోవు; చెబితే ఇలా గొడవ చేస్తావు!'

'గొడవ కేంవుందిలెండి. మా వాళ్ళూ మీకు బట్టలు ఎక్కువే తీసేరు. నేను పుచ్చుకోలేదని; అక్కసుకొద్దీనీ. దానికి తోడు మా చిన్నయ్య వెటకారం ఒకటే; మీ ఆయన వొచ్చినప్పుడే ఇస్తాంలేవే, అంటూనూ. పెద్దన్నయ్య పట్టికెళ్ళమంటూంటేకూడా బీరువాలో పెట్టేశాడు... ...నాకుక్రోషం వొచ్చి అడగేలేదు ... ... వెధవది, బట్టలకేంగాని — ఎక్కడున్నారో, ఏం చేస్తున్నారో, ఏం తిన్నారో, అసలారోగ్యంగా ఉన్నారో లేదో అని నా మనస్సు మాత్రం మూడు రోజులూ విలవిల్లాడి పోయింది.



వాళ్ళంతరూ వరధ్యానంలో వున్నావా, వుంటే పతిధ్యానంలో ఉన్నావా అంటూ పరామర్శలూ వేళాకోళాలూనూ...... బయలుదేరేరేమో; ఆ బస్సో రైలో ఎక్కడేనా యాక్సిడెంటయి పోయిందేమో అని బెంగొకటీ — పోనీలెండి, ఎక్కడైతేనేం; పండగపూటా ఇంత పప్పూ అన్నం తిని హాయిగా నిద్రపోయారు కద; నా కంతేచాలు......' నిజం అయినా సరే కొంత విసుగుతోనే చెప్పేను. అయినా ఎంతో తేలిక పడింది మనస్సు.

'సరి సరి—పప్పూ అన్నం అంటూ వేమిటి! నవరసాలూ, పిండి వంటల్తో, బ్రహ్మాండంగా చేసేరు. ఇహ విశ్రాంతంటూవా; వేరేగ్గదీ, దోమతెర మంచం, దనపిల్లో! — అనుకో కూడదు గానీ, మీ యింట్లో అయితే నాకలా జరగనే జరగదు!'

'పోనీలెండి పాపం, మా వాళ్ళింట్లో మీ కెన్నడైనా బాగాజరిగింది కనకనా!' అని, లేచాను. ఉడుకుబోత్తనం వొస్తోంది, ఆయన మాటలకి. మా వాళ్ళింట్లోనే కాదు, వాళ్ళ వాళ్ళింట్లోనూ...అంటే మా అత్తారింట్లోనూ—ఆయన కలా జరగదు. ఆమాట ఆయన అన్లేదు. నాకనాలని ఉంది గాని ఆయన అన్నంత సుళువుగా నే నెలా అనడం!—ఆలోచిస్తూ కిటికీ దగ్గర నుంచుంటే అమ్మ పాడిన పాటలో వో చరణం జ్ఞాపకాని కొచ్చింది.

ఇయ్యగలా చోటూనే బియ్యమంద రాదా;

పెట్టగలా చోటూనే పెళ్ళాగా రాదా?

అని సుభద్ర అర్జునుణ్ణి దెప్పుతుంది. ఇలాంటి సందర్భంలోనే, ఈ అర్జునుణ్ణి దెప్పేభాగ్యం సుభద్రదికాదు; నా దైంది......రాగవరసలో అంటే ఆ చరణాలు ఎంత బావుంటాయని! ఆకర్షణకి తట్టుకోలేక అనేశాను......చెప్పాలని కానే కాదు.

ఆయన చిరునవ్వు మొహాన పోసుగుని లేచి కిటికీ దగ్గరకొచ్చారు. రెండు చేతులా నన్ను పొదివి పట్టుకొని—'నే ముందే చెప్పేను కదే; నువ్వు బాధపడతావని!' అన్నారు.

'బాధ కాదండీ; బోధ!' అన్నాను, మనస్ఫూర్తిగా నవ్వుతూ.


● ● ●

అమలాపురం మునిసిపాలిటీలో ఏదో లెక్కలు తనిఖీ చెయ్యడానికిటు వెళ్ళేరు మా ఆయన, పదిహేనురోజులైంది. ఇవాళో రేపో రావాలి ఎదురు చూస్తున్నాను.

అంతలో పార్థసారధి అని, ఆయన స్నేహితు డొకాయన, ఒచ్చేడు. 'అర్జునరావుగారున్నారా?' అంటూనూ.








నా కతన్ని యిదివరకే తెలుసును. కూచోబెట్టి, సంగతంతా చెప్పాను. ఏదేనా పనుంటే ఉండిపోయి, రేపు ఆయన్ని చూసి వెళ్ళమన్నాను.

అతను ఉండడానికి వీల్లేదనీ, కొంచెం డబ్బు కావలసి ఒచ్చేననీ, చెప్పేడు. 'ఆయన పిఠాపురం నించి ఒచ్చేసిన దగ్గర్నుంచీ కూడా నా ఇబ్బందు లలాగే ఉండిపోయాయి!' అన్నాడు.

'పిఠాపురం ఎప్పుడొచ్చారీయనా?' అన్నాను.

'మొన్న పండక్కి ఒచ్చేరు కదండీ.'

'పండక్కి—అంటే?'

'సంక్రాంతిపండక్కండీ—తెలియనట్టడుగుతారేం?—ఆరోజు వైజాగ్ వెళతానని అర్జున్రావుగారు బైలుదేరడం, స్టేషన్లో ఎవరో టిక్కెట్‌తో సహా ఉన్న పర్సు కాజెయ్యడం—మీతో ఆయనేం చెప్పలా?'

నాకళ్ళు తిరిగాయి. మనస్సులో విద్యుత్తు ప్రృథఃకరించి నట్టయింది. కడుపులో చెయ్యిపెట్టి తిప్పినట్టయింది. నీరసం వచ్చేసింది. స్పృహ

తప్పిపోతుందని భయం వేసింది... డబ్బు పోవడం కాదు, ఎవరో కాజెయ్యడం!

'లేదండీ. ఏం జరిగింది?' అని చిరునవ్వు నటించాను.

'సరిపోయింది. మీతో ఏం చెప్పలే దన్నమాట... ...' పార్థసారధి చిరునవ్వు నవ్వాడు, '...ఏ మొహం పెట్టుకు చెబుతాలెండి! ... ...ఈయనేమో టిక్కెట్ కొనుక్కొనీ, బండి లేటుకదా అని నిద్రపోతూఉంటే ఎవరో పర్సుకాస్తా కొట్టేశారు. ఆ సంగతాయనికి తెలీక బండి రాగానే ఎక్కేశారు. ఎక్కగానే నేను కనిపించేసరికి మాట్లాడుతూ కూచున్నారు... ... సామర్లకోటలో టిక్కెట్లు చెకింగ్ చేసే స్టాఫ్ ఒచ్చి అడిగితే జేబులూ, బేగ్, అన్నీ తడుముకొని, వెతుక్కొని, పర్సు పోయిందని తేల్చారు... ...'

'ఊఁహూఁ'

'...పండగ ఎడ్వాన్సు డెభ్బయ్యాయిదుట. ఇంట్లోంచి తీసుకున్నవి ఇరవైటు; కాక టిక్కెట్టుటు—మొత్తం నూరు... ...టిక్కెట్టులేదని వాళ్ళు ఛార్జ్ చేసేరు. బొటాబొటీగా నా దగ్గరున్నది సరిపోతే ఇచ్చేశాను. పిఠాపురానికి టిక్కెట్ రాయించి... పొద్దున్నే వేరే బండిలో వెళ్ళురుగాని రండని, పిఠాపురంలో దించేశాను. అప్పటికి మా యిద్దరి దగ్గిరా కలిపి ఇరవైఒక్క నయాపైసాలు మిగిలేయి... ...'

'అంతకుముందు నాలుగు నెల్నించీ నాకు జీతాలు లేవు. శాంక్షన్ రాలేదు, మా పోస్ట్లకి, అందుకని జీతాలు డ్రా చెయ్యలేదు. మా వాళ్ళని పుట్టింట్లో ఒదిలేసి, హోటల్లో అరువుపెట్టి రెండునెలలు తిన్నాను. రెణ్ణెల్లు దాటాక వాళ్ళూ పెట్టలా. స్వయంపాకం మొదలెట్టాను... ...బియ్యం ఉంటే మిరపకాయలేకా, పప్పుంటే నెయ్యిలేకా, బాధలు పడుతున్న రోజులు...మా డిపార్టుమెంట్ సంగతి మీకూ తెలుసుగా. తిండికి లేక చస్తున్నా సరే, కేంపూ వర్క్ మాత్రం యమ అర్జంట్! ఎడ్వాన్సులైనా యివ్వరు.—అలాగే బాధలుపడుతూ, రాజమండ్రి కేంప్ ఒచ్చానన్నమాట... చేతిలో ఉన్న డబ్బులు కాసినీ, ఎక్సెస్‌కి కట్టేశాను. పొద్దుట్లేచి ముష్టి ప్రారంభించాను...ఏంలాభం, అందరికీ పండగే. తగని ఖర్చులూ! ఎక్కడా పుట్టలేదు సొమ్ము. అందులో నాకు జీతాలు రావడం లేదని అందరికీ అవగాహన అయిపోయింది ... ... ఇంతాచేసి ముష్టి మూడు రూపాయలు దొరక్క, ఆఖరికి, ఆయన, ఇక్కడే ఉండిపోతాను లేవోయి, నీతోబాటే — అన్నారు:... ...నాకు కక్కాలేక మింగాలేక అవస్థొచ్చిపడింది... ... ...'

'అయితే మీ రిద్దరూ కలిసి పిఠాపురంలో గడిపారా, పండగ మూడు రోజులూ?— పోనీలెండి పాపం!— థేంక్స్' అన్నాను; దుఃఖం దిగమింగుకుంటూ.

'ఏం గడిపాం; నా మొహం!— ఆయనలాటి మనిషి, నేనలాటి పరిస్థితుల్లో—చేతిలో కాణీఅడని పరిస్థితుల్లో వొచ్చి ఉండిపోవలి సొచ్చినందుకు నాకెంత బాధ అనిపించిందో చెప్పతరంగాదు. సరిగ్గా తిండైనా పెట్టలేకపోయాను... కూరకైనా డబ్బులులేక బాధలుపడ్డాం...పొద్దున్నే బన్‌రొట్టి అరువుతెచ్చి టిఫిన్; ఐదు నయాపైసలుంటే టీపొట్లాం తెచ్చుకుని టీ కాచుకునేవాళ్ళం. (కాఫీ మరిచే పోయాం)—బజార్లో కొన్న వూరగాయ, అప్పడాలూ, పెరుగు మనిషి నెల్లాళ్ళనించీ డబ్బులిచ్చేరు కాదని సణుగుతూపోసే మజ్జిగనీళ్ళూ పోసి— ఇదీ నే నాయనకి పెట్టిన భోజనం!— పోనీ అలాగేనా పెట్టగలిగానా, అంటే; సంక్రాంతినాడు సాయంత్రానికల్లా బొగ్గులు అయిపోయి, ఎక్కడా బుట్టెడు అప్పైనా పుట్టేయి కావు!— అందరూ ఎంచక్కా పంచభక్ష్య పరమాన్నాలూ వొండుకుని పండుగ చేసుకుంటూ వుంటే సాయింటికి రాక రాకొచ్చిన వారూ, నాకన్నా అన్ని విధాలా పెద్దవారూ, ఇలాటి కష్టాలు ఎన్నడూ ఎరగని వారూ అయిన అర్జునరావుగారికి అలాటి సత్కారం చేసి అవమానించవల సొచ్చినందుకు నాకెంత బాధ కలిగిందో—నిద్రకూడ సరిగ్గాలేదు. సమయానికి రెండు దుప్పట్లు చాకలాడి దగ్గర ఉండిపోయాయి. దోమతెరలు తెచ్చుకోలేదు. ఒకటే దోమలూ, చలీ. ఒక్కరోజులైనకైతే ఎలాగో గడిపేద్దుం కాని పండగలు కావటం, దరిద్రం మరీ భూతద్దంలోంచి చూసినట్టు కనిపించసాగింది. ఆఖరికి సంక్రాంతినాడు సాయంత్రం, ఉండబట్టలేక, బట్టల కొట్టాయన్ని బతిమలాడితే రెండు దుప్పట్లూ, ఒకపంచెల్చాపూ, రెండు రడీమేడ్ షర్టులూయిచ్చాడు; పద్దు రాసుకుని—అత్తారింటికి వెళదామని; అందరితో సరదాగా గడుపుదామనీ బైల్దేరిన ఆయనకి నావల్ల అలా అయింది. రైల్లో నేను కనబడకపోతే ఆయన, పర్సుపోయిన సంగతి ముందే తెలుసుకొని, వెంటనే ఊళ్లో కొచ్చి ఏవో తంటాలుపడి మర్నాటికైనా విశాఖపట్నం చేరుదురు. వెనక్కి వెళ్ళలేక, ముందుకిపోలేక—అలా అవస్థకి లోనైన ఆయన మొహం చూడ్డానికి నాకు మొహం చెల్లలేదు. ఎంతబాధో!'

'— అయ్యో. ఇంకా నయం టిక్కెట్ కలెక్టర్స్ కివ్వడానికైనా మీ దగ్గిర ఉందిగనక—' అని ఏదో, అన్నాను. ఆతరవాత నాకు మాటే రాలేదు. ఊరుకున్నాను.

'ఆఖరికి, కనుం వెళ్ళిన మర్నాడు తిరిగి రావడానికి డబ్బులు లేవుగా,

నాకు తెలుసున్న ఓ లారీ డ్రైవర్ తో చెప్పి, లారీలో ఎక్కించి పంపేవండీ, ఆయన్ని రాజమండ్రి !— ఎందుకులెండి; అవన్నీ వింటున్నకొద్దీ మీకు బాధ !"

ఇంతకంటె బాధపెట్టేమాట అతనేదీ అన్లేను. నా కింక ఏడుపు ఆగదనిపించింది. "ఉండండి, మీకు కాఫీ తెస్తాను!" అని లోపలి కెళ్ళాను.

నా మొహం నటించ గలిగింది గాని, నా మనస్సు కళ్ళూ నటించలేకపోయాయి. లోపలికెళ్తూనే, నీరు



ఏజంట్లు:
సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్సీస్)
విజయవాడ . సికిందరాబాదు . మధుర . బరహంపురం . బెంగుళూరు

కమ్మిన కళ్ళకి ఏదీ కనిపించక, వెంటనే తుడుచు కోవల సొచ్చింది.

● ● ●

అలాగే మనస్సూనూ.

నా మనస్సు, పరిపరి విధాల పోయింది... ... సిల్లీగా కనుపించే ఈ పండగ ఉదంతం అనుభవం నాకేవో కొత్త పాఠాలు నేర్పడానికి సమకట్టినట్టుంది.

● ● ●

నా గుండె నీరైపోయింది. జరిగింది నెమరు వేసుకొంటే యిలా కనుపిస్తోంది... ఆయనెలా వున్నారో అని నేను అనుక్షణం బాధపడడం వల్లే ఆయన నిజంగా బాధలు పడ్డారు, తిండి అమరిందో లేదో, నిద్ర కుదిరిందో లేదో, సరదా లేదేమో, సరసం లేదేమో, అని నే నెలా అనుకున్నా అన్నీ తథాస్తైపోయి, ఆఖరికి ఏక్సిడెంటైందేమో అని నే ననుకొనే సరికి ఆయనకి లారీలో ప్రయాణంచేసే యోగం పట్టడం! ఇంత పాపాత్మురాలినా, నేను! — నాకాయన మీదవున్న ప్రేమాభిమానాలు కీడునూ చెడునూ శంకింప జెయ్యడం తప్ప వరోఃని ఎరగవా? —ఆయనెక్కడో కులాసాగా, హుషారుగా, ఆనందంగా ఉండివుంటారని నే నెందు కనుకో లేకపోయానో! అలా అనుకుంటే అలాగే ఉండేవారేమో.



ఈ ఆడిట్ క్యాంప్ పదహారో రోజు ఎప్పుడు పూర్తవుతుందో ఆయనెప్పుడు ఇంటికొస్తారో ... ఆయన్ని ఈ క్షణం చూడాలనుంది.

హాల్లో ఆయన బస్ట్‌ఫోటో కెదురుగా నించొని, సగం అల్లినజడ ముందుకు తెచ్చుకుని అల్లుకుంటూ, ఓసారి పైకీ ఓసారి కిందికీ చూసుకుంటూ, ఆఫోటో నన్ను పలకరించిన పులకరింపుకి సిగుపడి నవ్వుకున్నాను.

కాని—అదికాదు. అదొట్టి మూఢ నమ్మకం ... ... అయనేమైనా రాజకుమారుడి తులసి మొక్కా, నా మనస్సులో భావాన్నిబట్టి పెరుగుతూ తరుగుతూ వుండడానికి? — అది కాదు. మరేదో వుంది పాఠం.

● ● ●

గొప్పలు చెప్పేరు, ఎయిర్ కండిషన్ గది, డన్లపిల్లో అంటూనూ. కోరికలు గుర్రాలై కోట గోడలు లంఘించేయి. సెనగలూ రాళ్ళూ కలియ బోసినట్టు బాగానే అల్లేరు. ఫిన్లే వారి పంచెలచావు! గొప్పలు విని అలా జరిగేటట్టు చేస్తారనా?— ఏమో నవ్వువస్తోంది.

రానీ, ఇంటికి !— ఎలా దెప్పితే బావుంటుందో. నిడదవోలు నించి ఎవరో ధాన్యం వ్యాపారస్తుడట, ఈ వూళ్ళో పనుండి మనింట్లో మకాం ఉందామని వొచ్చాట్ట. ఎయిర్ కండిషన్ గదీ డన్లపిల్లో లేవని వెళ్ళిపోయాడు, అననా? అంటే ఏమంటారో.

అదీ కాదు. గొప్పకోసం ఆయనెప్పుడూ తాపత్రయ పడలేదు. మా పుట్టింటూరు గొప్పగా జరిపించలేదని ఆయన అభిప్రాయం కానే కాదు. ఇంకేదో వుంది, నేనైనా మరెవరైనా నేర్చుకోవలసింది !

● ● ●

ఈ అబద్ధాలెందు కాడేరో? మోసంచేసేరు ... ... అవును.

అబద్దా లాడవలసిందే. ఈ అర్జునులవారు ఆ పార్థసారథితో, ఒక పీఠికాపురాన నా ఎడబాటులో గడిపిన ఆ యుగాల చరిత్ర—ఆయన నాతోనే కాదు, ఏ భర్త ఏభార్యతో చెప్పినా అందంగా వుండదు ... ...

పార్థసారథే, కొంచెం ఆలోచించి నాతో నిజంచెప్పక మానెయ్యవలసింది ... ... అసలీయనే, అతన్ని కూడా కట్టుదిట్టం చేసుకో వలసింది. ... ... క్రైమ్ లేకపోయి ఉంటుంది. నేను రైలుదిగి, రిక్షాఎక్కి ఝాడించే సమయాని క్కూడా ఆయనకీ అబద్ధాలు తట్టలేదు... ...రాత్రి మళ్ళీ, పునఃపృచ్ఛలో వుట్టిన ఉపాయం ... అంతలా నె నడక్కపోతే ఆయన చెప్పేవారే కాదు.

ఇంతాచేసి దారిద్ర్యం, లోకంలోని తత్త్వవేత్తలందరూ అనుభవనీయమని తేల్చి ముందీ చెప్పిన ఉదాత్తయోగం—తప్పకుండా చవి

చూడవలసిందే. కాని పండగ అవడాన్ని—ఒచ్చింది పేచీ... ...అంతు చేత—నా సంతోషం కోసం, నేను మూడు రోజులూ అనుభవించిన వేదన మరిచిపోడం కోసం, ఆయన సుఖంగా ఉన్నారు కదా అని నేను తృప్తి చెందడం కోసం, అతే మాటాడితే మా ఆయనకేం లోటు, ఇలాంటి గొప్ప స్నేహితులున్నారని నేను పొంగిపోడం కోసం — వొక అందమైన అబద్ధం ఆడేశారు, ఆదర్శవంతంగా.

నిజానికి ఆదర్శం అంటే కూడా అందమైన, కష్టమైన అబద్ధమేగా,

క్షణికం కానీ, శాశ్వతం కానీ, ఆనాటి, ఆయనగారి, అందమైన అబద్ధాన్ని విని, నేను పొందిన ఆనందాన్నీ, అది చూసి ఆయన పద్ద తృప్తినీ, ఆయనా నేనూ స్మరణీయంగా ఉంచుకోడంమాత్రం కల్తీ లేని నిజం!

నిజంకోసం అబద్ధం!

అబద్ధం అని తెలిసి పోయినంత మాత్రాన అందం నశించి పోయేటట్లయితే కావ్యాలు కాయితప్పడవలూ, ప్రబంధాలు పకోడీపొట్లాలు అయిపోయి ఎప్పుడో పోయి వుండేవి.

కోపగించుకునీ, మీ కథ నాకు తెలిసిపోయిందండోయ్ అని వెటకారంచేసీ, నే నే ప్రయోజనాన్ని సాధించేది? ఓ గడియసేపు ఆయన్ని దులిపేసి కడిగేసి యిలా చేస్తారా అని నిలదీసి అడిగితే ఫలితం ఏమిటో నాకూ తెలుసు. ఆయన నా కిచ్చిన ఆనందం అంతా ఒట్టి నీటి మీద రాతయిపోతుంది. ఆయన బాధపడి పోతారు. క్షమార్పణలు చెప్తారు. మనస్ఫూర్తిగా పశ్చాత్తాప పడతారు. అయితే చాలా చిన్నబుచ్చుకుంటారు... నేనే ఆయన్ని చిన్నబుచ్చేసే కన్న అవమానం ఏముంది, నాకు?

నేను పార్థసారథంత తెలివి తక్కువదాన్ని కాదు!

...నా కానందం యిస్తున్నానన్న గర్వం ఆయన కుండడం నా జీవితాని కెంతో అవసరం, ఆరోగ్యం! ఆ గర్వాన్ని భంగం చెయ్యడం చాలా ప్రమాదం... నన్ను సుఖపెడుతున్నాననీ, ఆనందిస్తున్నాననీ ఆయన అనుకుంటే, అది భ్రమే అయినా ఆయనకి ఆరోగ్యం... ...అవసరమైనంత భ్రమ లేక, ఎప్పటి కప్పుడు కఠోర సత్యాన్నే కలుసుకుంటూ, నిరాశల్నే ఎదుర్కొంటూ వుండడం వల్లనే జనం సుఖపడలేక పోతున్నారు...

● ● ●

టిఫినూ కాఫీ యిచ్చి, పార్థసారథి వాట్ని స్వీకరిస్తున్న సమయంలో, నేను నేర్చుకున్న పాఠం, వాటికన్న రుచిగా శుచిగా అతనికిఅందజేసేను. అతను చేసిన తప్పు తెలుసుకొని, మరోతప్పు చెయ్యకుండా వుండే అవకాశం ఒస్తోందంటే అది అంది పుచ్చుకుందికి చాలా వుత్సుకత చూపించేడు. దాంట్లో అతనికి చాలా ఆనందం కనబడేటట్లు చూపించేను.

నవ్వుకుంటూ నమస్కరిస్తూ వెళ్ళాడు పార్థసారథి.

● ● ●

మర్నా డెవరితోనో సినిమాకి వెళ్ళేను. అట్నుంచొచ్చేసరికి మా ఆయన ఈజీచైర్లో పడుకుని నిద్ర రోతున్నారు.

'ఎప్పుడొచ్చేరండీ?' అన్నాను, లేవుతూ.

'ఏడుంబావుకి'

'అయ్యో; అనుకుంటూ నేఉన్నాను సుమండీ. వంటకూడా చేసిందాన్ని పీ మోలే, ఇవాళే ఒస్తారా అని అనుకుంటూ కామాక్షమ్మ తమ్ముంతో సినిమాకి వెళ్ళేను!'

'పోన్లే—'

'కాళ్ళు కడుక్కోండి; భోం చేద్దాం. ఇద్దరం కలిసితిని ఎన్నాళైందో!'

ఆయన నావేపు విచిత్రంగా చూస్తూ లేచేరు.

నా ధోరణి కృత్రిమంగా తయారైపోతోందని గ్రహించాను. వెంటనే నోటికొచ్చిన మాటేదో పెదిమల్లోనే బిగించేశాను.

'పెట్లో డబ్బు తక్కువైందే—! ఏమైనా కొన్నావా?' అన్నారు మా ఆయన; కొంతసేపుపోయాక.

---

● ఇద్దరు బిచ్చగాళ్ళు చెట్టుకింద కూచ్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

ఒకడు ఇలా అన్నాడు : 'ఒకసారి నాకు అయిదు రోజుల పాటు ఎక్కడా బిచ్చం దొరకలేదు. విపరీతంగా ఆకలేసింది. అయినా ఎలాగో ఇంకో రెండు రోజులు ప్రాణాలు నిలువుకున్నాను. అప్పటికీ బిచ్చం దొరకలేదు.'

రెండోవాడు : 'అప్పుడేం చేశావ్?'

మొదటివాడు : 'ఏం చేస్తాను. ఆకలికి మలమలమాడి చచ్చిపోయాను.'

రెండోవాడు : 'చచ్చిపోయావా? ఇప్పుడు బతికే వున్నావుగా?'

మొదటివాడు ; 'అ, ఇదీ ఓ బతుకేనా?'

ముద్దనోట్లో ఉండిపోయి నేనేం అన్లేదు. 'లే'దన్నట్టు తలూపాను.

'—మరేంలేదు; రవణమూర్తి డబ్బు అప్పు కావాలంటేను, ఇస్తాను రమ్మని ఇంటిదాకా తీసుకొచ్చి లేదని పంపవలిసొచ్చింది—'

'అప్పు కావాలని ఒచ్చేరా ... తీర్చవలసిన బాకీ ఒకటుంటే తీర్చే శాను, నేను.' అన్నాను, ఆయన వేపు చూడకుండా.

'ఎవరి కబ్బా?'

'ఎవరో పిఠాపురంలో బట్టల వ్యాపారస్టుట్ట. మీరు నలభైరెండు రూపాయల చిల్లరివ్వాలంటూ బిల్లు బుక్కు తెచ్చి చూపించాడు.... ... ఏదో పనుండీ రాజమండ్రి ఒచ్చి పనిలో పనిగా మనింటి కొచ్చినట్టు న్నాడు... ...మీ సంతకం ఉంది, బాగానే గుర్తుపట్టాను. మనింటి గుర్తులు మీ ఫ్రెండెవరో చెప్పేట్ట, తిన్నగా ఒచ్చేశాడు... ... సరేలే, ఏ క్యాంప్లోనో ఎప్పుడో తెచ్చుం టారు అనుకుని, పెట్లోడబ్బు ఉంది, తెచ్చి యిచ్చేశాను.'

మా ఆయన ఒక్కనిమిషం తినడం మానేసి, అంతావిన్నారు 'ఇంకే మైనా చెప్పేడా?' అన్నారు. ఆయన అంతలా తెల్లబోవడంచూసి, బిల్లు బుక్కుమీద తారీకు చూశావా అని అడిగేస్తారేమోననీ, ఈ కథ పప్పులో కాలువెయ్యకుండా ఒడ్డెక్కించ గలనా అనే భయం వేసింది.

"ఊఁహూఁ. ఏం చెప్పలేదే."

ఆయన నావేపు ఇంకా కాస్త అనుమానంగా చూస్తూ "పార్థసారథీ, ఆ సంగతులేమీ చెప్పలేదూ?"

"పార్థసారథంటే, నల్లగాఉండే ఆయనేనా, ఇస్త్రారెన్సు—"

"ఛీ ఛీ అతనుకాదే, తెల్లటాయన, సర్వేయరు!"

"ఓహో, ఆయన ఊసెందుకూ, ఇప్పుడు?"

"అఁహాఁ. అతనూ పిఠాపురంలోనే ఉంటున్నాడులే!"

"ఏమో, అయితే మనింటి గుర్తులూ అవీ అతనే చెప్పి ఉంటాడు. ... ...సినీమాకి బైల్దేరుతూ వుంటే ఎదురుగా ఒచ్చాడు, వెంటనే పంపేశాను... ...ఇంతకీ మీరు బాకీ ఉండడం నిజమేకద!"

మా ఆయన నోట్లో ముద్ద పెట్టుకొని, తలవూపారు; పరధ్యానంగా.

□□□



# శిశిరాలా సరిహద్దులా

( గతసంచిక తరువాయి )

## 23

ప్రసాద్ తల్లి చనిపోయింది. ప్రకాశరావుగారు అంత్యక్రియలు ముగించి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటిముందు రెడ్ క్రాస్ వ్యాన్ నిలిచిఉంది. ఆయన అనుమానిస్తూ లోపలికి అడుగు పెట్టేసరికి అక్కడ కూతురితో ఎవరోఆఫీసరూ, కొందరు స్త్రీలూ మాట్లాడుతున్నారు. ఆయన రాగానే అందరూ మౌనంగా ఉండిపోయారు. గంభీరంగా, బెబ్బులిలాగా ఉండే పోలీస్ ఆఫీసర్ ప్రకాశరావుగారు భార్య మృతితో జీవచ్ఛవం అయిపోయాడు. చిక్కిపోయి, నీరసంగా, అతిదీనంగా ఉన్నాడు. వాళ్ళందరూ ఎందుకు వచ్చారో, ఇంటిముంగిట రెడ్‌క్రాస్ వ్యాన్ నిలిచినకారణమేమిటో ఆయన గ్రహించుకో గలిగాడు. ఆయన దుఃఖం ఇనుమడించింది. భార్య చనిపోయింది. కొడుకు చావుకు సమీపంలో ఉన్నాడు. ఇప్పుడు కూతురు కూడా అక్కడికే వెళ్తున్నది. తనకిక ఎవ్వరూలేరు ప్రపంచంలో. తాను ఏకాకి. అందరూ తనను వెలివేసి తననుంచిదూరంగా వెళ్ళిపోతున్నారు.

ప్రకాశరావుగారు ఎవ్వరితోనూ మాట్లాడలేదు. ఆయనతో ఎవ్వరూ మాట్లాడలేదు. ఆయన పరిస్థితిచూసి పలకరించే ధైర్యంలేక మౌనంగా ఉండిపోయారు. కానీ 'మీ అనుమతి కావాలి" అని అడుగుతున్నట్లుగా ఉన్నాయి వారి ముఖాలు. అందరూ ఆయన సమాధానంకోసం ఎదురు చూస్తున్నారు. ఆయన నీరసంగా సోఫాలో కూలిపోయి,ఉత్తరీయంలో ముఖం దాచుకుని, దీనంగా విలపించాడు. ఆయన కన్నీరు చెక్కిళ్ళ మీదుగా కారి ఉత్తరీయంక్రిందుగా జారిపోతున్నాయి. "తీసుకువెళ్ళండి. ఇక నా అనుమతితో నిమిత్తంలేదు.

సీరియల్